# తీర్పు

సమయం 10.30 నిముషాలు కావటానికి ఇంకా కొన్ని సెకన్లు మాత్రమే వుంది.

కోర్టు హాలంతా జనంతో కిక్కిరిసి ఉంది. కోర్టు ఆవరణంతా జడ్జిగారిచ్చే తీర్పును కవర్ చేయటానికి వచ్చిన పత్రికా విలేఖర్లతో, టి.వి.ఛానళ్ల కెమెరాలతో నిండి ఉంది.

సరిగ్గా 10.30 నిముషాలకు జడ్జిగారు హుందాగా ధర్మాసనాన్ని అధిష్టించారు. ఆయన ముఖంలో గంభీరత చోటుచేసుకుని వుంది.

నెల రోజుల క్రితం నగరంలో సంచలనం సృష్టించిన యువతి అత్యాచారం కేసు తాలూకు తీర్పు ఇవ్వనున్నారు ఆయన.

దేశంలో అత్యాచారాలు సర్వసాధారణమైపోయిన రోజుల్లో ఈ కేసు అంత సంచలనం సృష్టించడానికి కారణం నిందితుడు రాష్ట్ర అధికార పార్టీ ఎం.పి., కేంద్రమంత్రిగారి ఏకైక పుత్రరత్నం కావడమే!



సాక్ష్యాలు ప్రవేశపెట్టబడ్డాయి. సంఘటనా సమయంలో నిందితుడు విదేశాల్లో వున్నట్లు డిఫెన్సు లాయర్‌గారు బలంగా నిరూపించారు.

అసలు యువతి పైన ఎటువంటి రేప్ జరగలేదని డాక్టరు సర్టిఫికెట్ ఇచ్చాడు.

అత్యాచారం జరిగిందని ఆరోపించిన యువతి నగరంలో రెడ్‌లైట్ ఏరియాలో వేశ్య అని, ఇదంతా ప్రతిపక్షాలు పథకం ప్రకారం పన్నిన కుట్ర అని అధికార పార్టీ సభ్యులు ఆరోపించారు.

విచారణ పూర్తయింది!

''నువ్వు చెప్పుకునేదేమైనా వుందా?'' చివరిసారిగా యువతిని ప్రశ్నించారు జడ్జిగారు.

ఆ యువతి కళ్ళనీళ్ళ పర్యంతమై ''కన్నబిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉండి అర్ధరాత్రి మందుల కోసమని వెళ్తున్న నన్ను తప్పతాగి పశువుల్లా అనుభవించి, నా బిడ్డ చావుకు కారకుడైన ఈ దుర్మార్గుణ్ణి శిక్షించి నాకు న్యాయం చేయండి. నేను ఒళ్ళమ్ముకుని బ్రతికే దాన్నే కానీ నీతి లేని దాన్ని మాత్రం కాదండి'' దీనంగా వేడుకుంది.

అంతా విన్న తర్వాత జడ్జిగారు ఏదో రాసుకున్నారు. సూదిపడితే వినబడేంత నిశ్శబ్దం నెలకొని వుంది.

''సాక్ష్యధారాలు పరిశీలించిన పిమ్మట మోపబడిన అభియోగాలు దురుద్దేశ పూరితమైనవిగా భావించి నిందితుడిని నిర్దోషిగా నిర్ధారిస్తూ కేసు కొట్టి వేయడమైనది''

జడ్జిగారు ఉద్వేగంగా తన తీర్పు చెప్పారు.

దొంగ సాక్ష్యాలు నిజం గొంతుక నొక్కాయి. న్యాయం అన్యాయం చేతిలో ఘోరంగా ఓడిపోయింది. అధర్మం ధర్మాన్ని వెక్కిరించింది.

ఆ యువతి ముఖం సిగ్గుతో చితికి పోయింది. నిందితుడి పెదవులపై గర్వంతో కూడిన నవ్వుని నవ్వు మెరిసింది.

అదే రోజు సాయంత్రం అతను నగరంలోని ఖరీదైన హోటల్లో కేసు గెలిచిన సందర్భంగా తన ఫ్రెండ్స్‌కు పార్టీ ఇస్తున్నాడు.

మందు పొంగింది. గ్లాసులు మోగాయి. మత్తు తలకెక్కింది.

అంతలో అతని జేబులోని సెల్‌ఫోను మ్రోగింది.

అవతలి కంఠం రేప్ జరగలేదని సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్‌ది.

''బాబూ నువ్వొకసారి అర్జంటుగా హాస్పిటల్‌కు రావాలి. లాబ్‌వాళ్ళు ఎందుకో అనుమానం వచ్చి ఆ పిల్ల బ్లడ్ శాంపిల్ టెస్ట్ చేసారు. రిపోర్ట్స్‌లో హెచ్.ఐ.వి. పాజిటివ్ అని తేలింది.''

**-కరిముల్లా షేక్ (నరసరావుపేట)**




